# వెంకటచలం పాత్ర

మేం ఎక్కడికో కారుమీద వెళ్తున్నాం. "మేం" అంటే అతడూ నేనూ, అతన్ని నేను నా స్నేహితుడను కున్నాను. కాని అతను నాకు స్నేహితుడు ఎప్పుడయ్యాడో, ఎక్కడయ్యాడో జ్ఞాపకంలేదు అసలు నాకు స్నేహితుడు కాడేమో అనికూడా భయం వేస్తూంది.

అతడు కారు డ్రయివుచేస్తున్నాడు. ఆ కారుకూడా అన్ని కార్లకిమల్లే లేదు. బ్రహ్మరధానికి మల్లేవుంది. పైన మట్టసంగా చిన్నడాబా, దానిచుట్టూ పిట్టగోడా వున్నై. ఆ పిట్టగోడ నిండా పూలమొక్కలే-రకరకాల పూలు. అన్నిటికంటే విశేషం ఏమిటంటే ఆ కారుకి స్టీరింగ్ వెనక భాగంలో వుంది. వెనకసీట్లో కూర్చుని అతడు డ్రయివు చేస్తున్నాడు. ఆ కార్లో పెట్రోలికి బదులుగా రెండు పీపాల పొగని గుమ్మరించాడు.

అతను నాతోమాట్లాడకుండా ముందుకు చూస్తూ కారుపోనిస్తున్నాడు. అతని వైఖరీ, చూపులూ, ఆకారం- అన్నీ సినిమాల్లో కథానాయకుడిని ఎత్తుకుపోయే విలన్ వ్యవహారంగా వున్నయ్. నాకు భయంవేసింది అందులో కారు శరవేగంతో వెళ్తూవుంది. నేను అనేక సినిమాలు చూశాను. కథానాయకల్ని ఇట్లా ఎందుకు తీసుకుపోతారో నాకుతెలుసు.

"ఏయ్, ఆపు" అన్నాను.

కాని ధ్వని గొంతులోనే వుండిపోయింది. బయటకు రాలేదు. ఇదే సినిమా అయితే ప్రేక్షకులు "సౌండ్" అని కేకవేసేవారు.

కారు కిటికీలోనుంచి బైటకు దూకుదామని చూశాను. ఏమి చిత్రం! కారు వెనక్కు నడుస్తూవుంది. అతను ముందుకు జాగ్రర్తగా శ్రద్ధగా చూస్తూ కారు వెనక్కి నడుపుతున్నాడు. అకస్మాత్తుగా అది దెయ్యం ఏమో

అని నాకు అనుమానం కలిగింది. అవయవాలన్నీ పరీక్షగా చూశాను. పదమలు తిరిగిలేవు. కొంచెం ధైర్యం తెచ్చుకొని అతని భుజంమీద చెయ్యేసి చెపుదామని ప్రయత్నించాను. కాని చెయ్యి కదల్లేదు. ఇంతలో కారువెనక బ్రహ్మాండంగా పొగలేవటం నాకు కనుపించింది. ఆ పొగగూడా కారుమబ్బులాగావుండి ఆకాశందాకా లేచింది. సీసా బిరడా తియ్యగానే సీసాలోనుంచి బయటకువొచ్చి పెరిగి పెరిగి ఆకాశంఅంత అయిన దెయ్యం జ్ఞాపకానికి వొచ్చి నాకు వొణుకు పుట్టింది. అతను మాత్రం తొణకలేదు. ముందుకు చూస్తూనే కారు బర్రున పక్కకి తిప్పాడు. కారు రోడ్డుదిగి కుదేస్తూ రంయిన వెళ్తూవుంది. నేను చూస్తూ చూస్తూ వుండగానే కారువెనక భూమి రెండు బద్దలై అగడ్త ఏర్పడింది.

“ఆ ” అన్నాను మళ్ళీ ధ్వని రాలేదు. కాళ్ళూ చేతులూ తన్నుకున్నాను. అవయవాలు కదల్లేదు. అగడ్త దగ్గరకు వొచ్చింది. నేను కళ్ళు గట్టిగా మూసుకున్నాను. కాని కళ్ళముందు అగడ్త స్పష్టంగా మృత్యుగహ్వారానికి మల్లే తెరచుకొని కనిపిస్తూనేవుంది. అతడుమాత్రం ఏమీ జరగనట్టుగానే కూర్చొని ముందుకు చూస్తూ కారు వెనక్కి నడుపుతున్నాడు.

భూమి బద్దలయినంత మోతతో కారు అగడ్తలోకి కూలింది. నేను నెమ్మదిగా లేచాను. చుట్టుపక్కల చూసేటప్పటికి అంతా అయోమయంగా వుంది. ఎక్కడుందీ తెలియలేదు. కారు చెక్కు చెదరకుండా ఆగివుంది. పిట్టగోడ మీద వున్న పూలుగూడా చెక్కు చెదర్లేదు. డ్రయివరు మాత్రం దూరంగా పడివున్నాడు. నేను చూస్తుండగానే లేచివొచ్చి మళ్ళీ కారులో కూచున్నాడు. ఆ కారుకి చక్రాల్లేవు. భూమికి గజం ఎత్తున గాలిలో నిలబడి వుంది.

వొచ్చి కారు ఎక్కమంటాడేమోనని భయం వేసి పారిపోటానికి ప్రయత్నించాను. ఎటుచూసినా పూలమొక్కలే- ఆకుజొంపాలే, తీగఉయ్యాల్లే. అక్కడక్కడా కుటీరాలున్నాయి. అవిగూడా పూలతీగలతో అల్లినవే! మధ్య ఎత్తుగా ఒక పెద్ద గాలిగోపురం వుంది. అది చంద్రమ్మ

పెట్టెకిమల్లే వుంది. పిచ్చిక గూడికమల్లే వుంది. నారదుడి శిఖకిమల్లే వుంది; దాని ముఖద్వారం కట్టడంకంటే పెద్దది. అక్కడికి వెళ్ళాను.ముఖద్వారంలో నుంచి లోపలికి వెళ్ళాను.

లోపల పీఠంవేసుకు కూర్చుని ఒకవ్యక్తి రాసుకుంటున్నాడు అతడుకూడా నేను ఎక్కివచ్చిన కారుకి మల్లే భూమికి గజం యెత్తున కూర్చున్నాడు. కింద ఆధారం ఏమీలేదు. గాలిలోనే కూర్చుని గాలిలోనే రాసుకుంటున్నాడు. ఒక్క క్షణం గారడీవాడా, కనుకట్టు మంత్రగాడా, అనిపించింది నాకు.

అతడు ఎర్రగా వున్నాడు. ఏభై సంవత్సరాలప్రాయం వున్న కుర్రవాడికిమల్లే వున్నాడు క్రాపుకుమల్లే కనిపిస్తున్నా అవి కాకిపక్షాలే. షర్టు వున్నట్లు కనిపిస్తున్నా అది వొట్టి శరీరమే, చెవులకు పూగుత్తులు పెట్టాడు. పెదిమలకు మందారపువ్వు రాశాడు, పైకి అంతా సంస్కర్తగా కనిపిస్తాడు. గాని వొట్టి సనాతనుడు ఛాందసుడు.

అతడు నన్ను చూడకుండా, వొంచినతల ఎత్తకుండా ఏదో రాస్తూనే వున్నాడు. మా కారుకంటే వేగంగా రాస్తున్నాడు. అతని కలంలోనుంచి ఒక్కొక్కపాత్రా పుడుతూంది. ముఖద్వారంలోనుంచి బయటకు వెళ్తూ వుంది. కాని నా కంటికి మాత్రం అన్ని పాత్రలూ ఒకే మాదిరిగా వున్నయ్. అదే నునుపూ, అదే ఉబుకూ,అదే వంపూ అన్నీ ఒకే రకంగా వున్నయ్. నాకు ఒక్కటే భేదం కనిపించింది కొన్ని పాత్రలకు వుల్లిపొర రవికె లున్నయ్. కొన్నిటికి అవికూడా లేవు.

అంతలో కొన్ని పాత్రలు నన్నుచూచి నా దగ్గరకు వచ్చి, నన్ను పట్టుకొని వొత్తి వొత్తి చూసి, నా చుట్టూజేరి చేతులు చేతులు కలిపి డాన్సు చెయ్యటం మొదలు పెట్టినయ్.

అది చూసి అతడు వాటిని తన దగ్గరకు పిలిచాడు. ఏమేమో చెప్పాడు. అతని పెదిమలు కదలటం కనిపించింది గాని మాటలు వినబడ లేదు. కాని నాకు అతను తన పాత్రలకు చెప్పింది బోధపడింది- "వాడు

పనికిరాడు. పొట్టి ఆకలిపెధవ అతని దగ్గరకు పోకండి'' అని చెప్పి వుంటాడు. ఎందుకంటే తరువాత వొక్క పాత్రకూడా నా దగ్గరకు రాలేదు. చరచరా బయటకు వెళ్ళిపోయినై.

ఇంతలో మరొక ఆడవాళ్ళ గుంపు ఆ గోపురం ప్రవేశించింది. చిరిగిన గుడ్డల్తో, రేగిన జుట్టుతో, ముడుతలుపడ్డ మొహాలతో చీదర చీదరగా వుంది ఆ గుంపు. అతని దగ్గర తయారై వెళ్ళే పాత్రలకూ, అతని దగ్గరకు వొచ్చే ఈ ఆడవాళ్ళకూ ఎంత భేదంవుంది– అంతా భేదమే!!

ఆ గుంపు సరాసరి ఆ రచయిత దగ్గరకు వెళ్ళి ఏవేవో సంజ్ఞలు చేసినై. అతడు జాలిగా, కరుణగా, ప్రేమగా చూశాడు కాని వాటిగోల మరీ ఎక్కువైంది. అన్నీ పొట్టలు కొట్టుకోవటం మొదలు పెట్టినై అతడు సహించలేక చెయ్యి పైకెత్తి చేత్తో అరిచాడు. ఆ గుంపు చెల్లాచెదరై పారిపోయింది. కొంతమంది నన్ను చూసి ఆగారు. వాళ్ళల్లో వాళ్ళు ఏదో గుసగుస లాడుతున్నారు. రక్షావైపు చూపించుకున్నారు. నన్ను చూపిస్తూ ఏమేమో యాక్షన్లు చేశారు. నెమ్మదిగా నా చుట్టూ జేరి సంజ్ఞలతో తమ కష్టసుఖాలు చెప్పుకోవటం మొదలు పెట్టారు. వాటి భావం నాకు సరిగ్గా అర్థంకాలేదు. కాని వాళ్ళను చూస్తుంటే నాకు జాలివేసింది. మొత్తానికి వాళ్ళంతా బాధపడుతున్నారనీ, చేతైతే ఆ బాధ తీర్చాలనీ అపేక్ష కలిగింది.

ఇంతలో గాలిలో గజం యెత్తున కూర్చున్న రచయిత కోపంగా లేచి గాల్లోనే నుంచుని వాళ్ళతో ఏమేమో మాట్లాడాడు. అతను కోపంగా మాట్లాడుతున్నాడనీ, వాళ్ళని దూషిస్తున్నాడనీ మాత్రం నాకు తెలిసింది. అతని కోపానికి తట్టుకోలేక వాళ్ళంతా పారిపోయారు.

అతను కూర్చొని మళ్ళీ పాత్రలను సృష్టించటం మొదలుపెట్టాడు. అవే పాత్రలు– అదేరకం! వేలకు వేలు– చదలపుట్టకుమల్లే పుట్టిస్తున్నాడు.

నాకు విసుగెత్తింది. అతన్ని పలకరించకుండానే బయటకు వొచ్చాను. ముఖద్వారం పక్కనక్కవున్న వొక స్త్రీ నన్ను చూచి పారిపోవటం మొదలుపెట్టింది. ఆమె చివరకి వొచ్చిన గుంపులోని స్త్రీయే చిరిగిన మురికి బట్టలూ....

ఏమనుకుందో, కొంచం దూరం వెళ్ళి మళ్ళీ వెనక్కు తిరిగి వొచ్చింది. నన్ను నఖశిఖ పర్యంతం పరీక్షచేసింది. ఆమె మొహాన పెద్ద పెద్ద మచ్చలున్నయ్. కళ్ళు పీక్కుపోయి గుంటలుపడి వికారంగా వున్నాయ్. బుగ్గలు చప్పిదవడలు....కాని చొకప్పుడు ఆమె చాలా అందం కలదని కొన్ని కొన్ని లక్షణాలవల్ల కనిపిస్తూవుంది.

"మీరు ఎవ్వరు?" అని ప్రశ్నించాను.

"నేను వెంకటచలం పాత్రని" అని తల వొంచుకొని జవాబు చెప్పింది.

నేను వెంకటచలాన్ని ఎరుగనుగాని అతని పాత్రలను కొన్నిటిని ఎరుగుదును–"నన్నుచూచి ఎందుకు పారిపోయావు?" అని అడిగాను.

"నాకు పురుషులంటే భయం. నిన్ను చూస్తే మరీ భయం వేసింది."

"ఎందుకు?"

"నేను లేచిపోయాను" అంది.

నాకేమీ అర్థం కాలేదు. ఆమె మాట్లాడుతూ వుంటే మాటలు గాల్లో తేలివున్నయ్, ఆమెకీ ఆమె మాటలకీ సంబంధం వున్నట్టే కనపట్టంలేదు. నేను మాట్లాడకుండానే ఆమె మళ్ళా చెప్పింది– "సాయిబుతో లేచి పోయాను" నేను నమ్మటంలేదని "ఏవొట్టుపడితే ఆ వొట్టు – నేను సాయిబుతోనే లేచిపోయాను" అంది.

"మంచిదనే! అయితే...."

ఆమె నన్ను ముగించ నివ్వలేదు. "భర్తను విడిచిపెట్టి సాయిబుతో లేచిపోయాను.ఆ మీరాసాయిబే నాకు దైవం ఇచ్చిన భర్త అనుకున్నాను. నా మీరా నన్ను వాడుకొని, నా యవ్వనాన్ని పీల్చి, అతని జబ్బులన్నీ నాకు ఎక్కించి, నన్ను విడిచిపెట్టాడు. ఇక ఇప్పుడు నేనేంచెయ్యను?" అని అడిగింది. కాని ఆమె ఎక్కువ విచార పడుతున్నట్లు కనపట్టంలేదు.

‘కానీ తెచ్చాను — మిఠాయి కొన్నాను –తిన్నాను’ అన్నట్లు చెప్పింది.
“ఇంకేం? బాగానే వుంది....”

“బాగా వుండంటే కాదు. ఆకలి....అని పమిటె కొద్దిగా పక్కకు లాగుతూ అంటుకుపోయిన కడుపుచూపింది.

“నీకు డబ్బులేదూ?”

“డబ్బు సంగతి ఎప్పుడు ఆలోచించాను? ముసలితనం వస్తుందనీ, విరూపిని అవుతాననీ ఎవ్వరు ఆలోచించారు? అసలు ఈ ఆలోచనలకు తీరిక వుందా? ఆ వెన్నెట్లో, ఆ మలయ మారుతంలో, ఆ మైదానంలో, ఆ గులాబీతోటలో, ఆ తీయని కమ్మని వాసనల్లో....”

నేను ఇవన్నీ వెంకటచలం పుస్తకాల్లో చదువుకున్నాను. అందుకని ఆమెని ఆ ధోరణిలో పడనివ్వకుండా ఆపి, “అయితే నన్ను ఇప్పుడు ఏం చెయ్యమంటావు?” అని అడిగాను.

“ఆకలి”

నేను కొంచెంసేపు ఆలోచించి, “వెంకటచలాన్ని అడక్కపోయావా?” అన్నాను.

“అడిగాను. కాని ఆ పిచ్చిముండ ఏం చెబుతుంది? అసలు నన్ను గుర్తేపట్టలేదు. నువ్వు“ నా పాత్రవు కానే కాదు పొమ్మన్నాడు. నేను జ్ఞాపకం చేసేటప్పటికి ఎంత జాలిగా, బాధగా, కరుణగా చూశాడనుకున్నారు? కాని ఏం లాభం? మీరు చూస్తున్నారుగా? అతని లోకంలో —”

“ఏమన్నాడు?”

“ఏమంటాడు? నువ్వు నా పాత్రవేకాదు. నువ్వు నా పాత్రవైతే నీకు ఆకలి అయ్యేదేకాదు అన్నాడు. నాకు మండి చెడామడా తిట్టి నాకుదారి చూపించమన్నాను. అతడు ఆలోచించి ‘ఆత్మహత్య చేసుకోరాదూ’ అన్నాడు ”

నాకు అకస్మాత్తుగా అతని పాత్రలన్నీ జ్ఞాపకం వొచ్చినై. ఎక్కువ ప్రేమించటం, లేచిపోవటం, ఆత్మహత్య చేసుకోవటం....ఇదే పని.

ఆమె చెప్పింది—"నేను వొప్పుకోలేదు. పోట్లాడాను. ఆత్మహత్య అంటే నాకు భయంలేదు. కాని ఆపేక్షలేదు. ఇక అతనేం చెపుతాడు? నేను కోప్పడుతుంటే బిక్కమొహం వేసుకున్నాడు."

నేను ఒక్క నిట్టూర్పు విడిచాను? ఆమెను చూస్తున్న కొద్దీ నాకు జాలి ఎక్కువయింది. ఆమెకు బాధపడే శక్తి, ఓపికాకూడా లేకుండా పోయినై...."మరి నన్నేం చెయ్యమంటావ్?" అని అడిగాను.

ఆమె ఒక్క అడుగు ముందుకు వేసి...."ఆకలి...." అంది.

"ఇక్కడ నాదగ్గర ఏమివుంది? బిస్కట్లు వున్నాయి—"

"అక్కర్లేదు. తీపి నేను తినలేను. తిని తిని మొహం మొత్తింది...."

నాదగ్గర ఇక ఏమీలేదు. పాపకు తీసుకువెళ్తున్న చక్కెడాలు వున్న మాట నిజమేగాని, ఆమెకు ఇవ్వటానికి సిగ్గుపడ్డాను. బాదంపప్పూ, ద్రాక్షరసం, యాపిల్సూ తినే ఆమెకు చక్కెడాలు ఎలా ఇవ్వటం? కాని ఆమె చెప్పేవరకూ వూరుకోలేదు. "మా పాప చక్కెడాలు తెమ్మంది...." అని మొదలు పెట్టాను.

"ఇంకేం ఇవ్వండి. ఇంతకంటే ఏంకావాలి? చక్కెడాలంటే నాకు చాలా ఇష్టం. నా మీరా టౌన్నుంచి వొస్తూ చక్కెడాలే తెచ్చేవాడు" ఏదో అనుమానంరాగా వొక అడుగు ముందుకువేసి "నూనెవేనా?" అని అడిగింది.

నేను "ఊఁ" అని మూలిగాను. "నూనె సరుకే కావాలి. నా మీరా ఎప్పుడూ నూనె సరుకే తెచ్చేవాడు" అంది.

నేను సిగ్గుపడుతూ సిగ్గుపడుతూ చక్కెడాల పొట్లం ఆమె కిచ్చాను. ఆమె ఆపేక్షగావిప్పి వొక చెక్కెడం నోట్లోవేసుకొని కరకరా నమిలింది. ఇంతలో ఏదో జ్ఞాపకం వచ్చినట్లు తటాలున ఆగి....“పిచ్చిముండా, నువ్వు మంచిదానివిరా!” అంటూ వొక్కఅడుగు ముందుకువేసి “నాది మాత్ర హృదయంరా! సహాయం చేసినవాళ్ళకు కృతజ్ఞత చూపకుండా వుండలేన్రా” అంటూ అమాంతంగా నన్ను కావలించుకొని గట్టిగా ముద్దు పెట్టుకొని పరిగెత్తింది. ఆమె పరుగు నేను చూడలేకపోయాను. ఊగుతూ అంగలు పంగలు వేసుకుంటూ చిన్నప్పుడు కర్రలమీద నడిచే వాళ్ళం చూడండి....అట్లా పరిగెత్తింది.

వెంటనే నాకు మొహంమీద మచ్చలు జ్ఞాపకం వచ్చినై. అది అంటురోగ మేమోనని భయం వేసింది. పుక్కిలించి వూద్దామని నీళ్ళ కోసం వెతికాను. వెంకటచలం ప్రపంచంలో మంచినీళ్ళుకూడా పుట్టవు.

—o—